సాక్షి
కాకినాడ

మంగళవారం । 6 । మే । 2025



మామిడిపై 'ఈగ' దాడి

మామిడి దిగుబడులను దెబ్బ తీయడంతో పాటు కాయ నాణ్యతను పిండి పురుగులు, కాయతొలుచు పురుగులతో పాటు పండు ఈగలు దెబ్బ తీస్తున్నాయి.


8లో



మీ నిర్లక్ష్యంతో 400 మందికి నష్టం

అర్హులైన తమకు మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫిమేల్) పదోన్నతి కల్పించడంలో ఉద్దేశ పూర్వక జాప్యం తగదని సచివాలయ ఏఎన్ఎంలు ఆవేదన వ్యక్తం చేశారు.

1,981 క్యూసెక్కులు.. కదలిపాలు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 1,981 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.05 అడుగులకు పెరిగింది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

బ్లాక్‌లిస్ట్‌లో 'ప్రసాద్' కాంట్రాక్టర్

అన్నవరం దేవస్థానం నిర్మాణాల్లో మరింత జాప్యం

అన్నవరం: ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చినట్లు.. సింహాచలం దేవస్థానంలో గోడ కూలి, ఏడుగురు భక్తులు దుర్మరణం పాలైన ఘటన అన్నవరం దేవస్థానంలో ప్రసాద్ స్కీమ్ నిర్మాణాల నిలుపుదలకు కారణమయ్యేలా ఉంది. 'నిర్మాణాలన్నీ పక్కా ప్లాన్తే' శీర్షికన 'సాక్షి' సోమవారం కథనం ప్రచురించింది. అన్నవరం, సింహాచలం దేవస్థానాల్లో ప్రసాద్ స్కీమ్ కాంట్రాక్ట్ సంస్థ ఒకటేనని, సింహాచలం ఘటనలో ఆ సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెడితే ఇక్కడ కూడా ప్రసాద్ నిర్మాణాలకు బ్రేక్ పడుతుందని ఆ కథనంలో పేర్కొంది. చివరకు అదే జరిగింది. సింహాచలంలో గోడ కూలిన ఘటనలో ఆ దేవస్థానం ఇన్‌చార్జి ఈఓ సుబ్బారావు, ఈఈ శ్రీనివాసరాజు మరో ఇద్దరు దేవస్థానం సిబ్బంది, ముగ్గురు టూరిజం శాఖ అధికారులు కలిపి మొత్తం ఏడుగురిని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాత్రి సస్పెండ్ చేసింది. అలాగే, ఆ దేవస్థానంలో ప్రసాద్ స్కీమ్ నిర్మాణాల కాంట్రాక్ట్ సంస్థ 'అనంతరాములు అండ్ కో'ను బ్లాక్‌లిస్ట్‌లో పెడుతూ ఆదేశాలిచ్చింది. అన్నవరం దేవస్థానంలో ప్రసాద్ టెండర్లు కూడా ఈ కంపెనీకే దక్కాయి. రూ.20 కోట్ల టెండర్లపై 16 శాతం లెస్‌కు కొటేషన్ దాఖలు చేసి దక్కించుకుంది. అంటే సుమారు రూ.3 కోట్ల తక్కువకు టెండర్ వేసింది. అయితే ఇప్పుడు ఆ కాంట్రాక్టర్‌ను ప్రభుత్వం బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడంతో అన్నవరం దేవస్థానంలో ప్రసాద్ స్కీమ్ నిర్మాణాలు కూడా ఆగిపోయే పరిస్థితి ఏర్పడింది. మళ్లీ టెండర్లు పిలిచినా ఆ ప్రక్రియ పూర్తి కావడానికి కనీసం మరో ఆరు నెలలు పడుతుంది. ఇప్పటికే ప్రసాద్ స్కీమ్ మంజూరైన పదేళ్లకు కానీ టెండర్ల వరకూ రాలేదు. తీరా టెండర్లు ఖరారయ్యాక సింహాచలం ఘటన కారణంగా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడటంతో అన్నవరం దేవస్థానంలో అయోమయ పరిస్థితి నెలకొంది. దీనిపై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

పీజీఆర్ఎస్‌కు 351 అర్జీలు



అర్జీదారు సమస్య వింటున్న డీఆర్ఓ వెంకటరావు

కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజలు 351 అర్జీలు సమర్పించారు. వారి నుంచి జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) జె.వెంకటరావు, ట్రైనీ కలెక్టర్ జె.మనీషా, హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామలక్ష్మి, సీపీఓ త్రినాథ్, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ, ప్రజల నుంచి అందిన అర్జీలకు సంబంధిత అధికారులు సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలను త్వరితగతిన అందించాలని అన్నారు. వచ్చిన అర్జీలను పీజీఆర్ఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి, అర్జీదారులకు రశీదులు అందజేయాలని సూచించారు.

రత్నగిరిపై భక్తుల సందడి



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: వేలాదిగా వచ్చిన భక్తులతో రత్నగిరి సోమవారం కిటకిటలాడింది. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు సత్యదేవుని ఆలయానికి చేరుకున్నారు. ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. సత్యదేవుని దర్శించిన అనంతరం భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి, రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. స్వామివారిని 30 వేల మంది దర్శించుకున్నారు. వ్రతాలు 1,400 నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో సుమారు 5 వేల మంది భక్తులు సత్యదేవుని అన్నప్రసాదం స్వీకరించారు. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి, శంకరులు సోమవారం ముత్యాల కవచాల అలంకరణలో (ముత్తంగి సేవ) భక్తులకు దర్శనమిచ్చారు.

వరదలపై నేడు సమావేశం

ధవళేశ్వరం: రానున్న గోదావరి వరదలను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు ధవళేశ్వరంలోని ఇరిగేషన్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఫ్లడ్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ గోపీనాథ్ సోమవారం ఈ విషయం తెలిపారు. వరదల నేపథ్యంలో తీసుకోవాల్సిన రక్షణ పనులకు సంబంధించి సమగ్ర సమాచారంతో సంబంధిత ఇరిగేషన్ అధికారులు ఈ సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

సీహెచ్‌ఓల సమస్యలు పరిష్కరించాలి



సీహెచ్‌ఓల దీక్షలకు మద్దతు తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

కాకినాడ సిటీ: కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల (సీహెచ్‌ఓ) సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా, కాకినాడ నగర కార్యదర్శులు తోకల ప్రసాద్, టి.అన్నవరం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్ర ప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ అండ్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీఎంసీఏ) పిలుపు మేరకు జరుగుతున్న సమ్మెలో భాగంగా కలెక్టరేట్ వద్ద సీహెచ్‌ఓలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు సోమవారం వారు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ, సీహెచ్‌ఓల ఆందోళన 8వ రోజుకు చేరుకున్నా ప్రభుత్వం నుంచి స్పందన కరువైందని విమర్శించారు. వారి సమస్యల పరిష్కారానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తక్షణమే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సీహెచ్‌ఓలను రెగ్యులర్ చేయాలని, నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని, కనీస వేతనం రూ.35 వేలు చేయాలని, ఈపీఎఫ్ఓ పునరుద్ధరించాలని, క్లినిక్ అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలని, నిర్దిష్టమైన జాబ్ చార్ట్ అందించాలని, ఎఫ్ఆర్‌సీ నుంచి సీహెచ్‌ఓలకు మినహాయింపు ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్, ట్రాన్స్‌ఫర్ ఎక్స్‌గ్రేషియా, పితృత్వ సెలవులు ఇవ్వాలనే డిమాండ్లతో సీహెచ్‌ఓలు సమ్మె చేస్తున్నారని వివరించారు. అసోసియేషన్ నాయకులతో ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి, సమ్మెను సానుకూలంగా పరిష్కరించాలని ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు వారి నిర్లక్ష్యం..
అన్నదాతకు శాపం




జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు

- ముందుగానే కొని ఉంటే ముప్పు తప్పేదే
- తడిసి ముద్దయిన రైతుల ఆశలు
- ఇప్పుడు హడావుడి చేసి లాభం ఏమిటి?
- నాదెండ్ల పర్యటనపై రైతుల పెదవి విరుపు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: 'చేతులు కాలాక ఆకులు పట్టుకున్న' చందంగా ఉంది కూటమి సర్కారు తీరు. అకాల వర్షాలతో రైతులు నిండా మునిగి నష్టపోయాక ధాన్యం కొనుగోలు చేస్తామంటూ హడావుడి చేస్తోంది. రబీ వరి కోతలు ప్రారంభానికి ముందే ధాన్యం కొనుగోళ్లకు సమాయత్తమవ్వాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడమే తమకు శాపంగా మారిందని జిల్లాలోని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పేరుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా రైతులకు మాత్రం ఎక్కడా మద్దతు ధర దక్కనే లేదు. రైతుల కష్టం దళారుల పాలైనా పట్టించుకోని సర్కారు.. ఇప్పుడు హడావుడి చేసి లాభమేమిటని రైతు నేతలు ప్రశ్నిస్తున్నారు. అకాల వర్షాలతో రోడ్ల పైన, కళ్లాల్లోను ధాన్యం తడిసి ముద్దయి, తాము నష్టపోవడానికి ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడమే కారణమని రైతులు మండిపడుతున్నారు. కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్.. జగ్గంపేట, పెద్దాపురం, కాకినాడ రూరల్ మండలాల్లో సోమవారం హడావుడిగా పర్యటించారు. తడిసి ముద్దయిన ధాన్యాన్ని పరిశీలించారు. ఇప్పుడు మొసలి కన్నీరు కార్చడానికి బదులు వరి కోతల ప్రారంభంలోనే ధాన్యం కొనుగోళ్లు, రైతుకు మద్దతు ధర దక్కేటట్లు చూసి ఉంటే తమకు మేలు జరిగేదని రైతులు వాపోతున్నారు.

బస్తాకు రూ.500 వరకూ నష్టం

వరి కోతల ప్రారంభంలో ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం గాలికొదిలేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కనీస మద్దతు ధర 75 కేజీల బస్తాకు రూ.1,750 ఉండగా, ప్రస్తుత పరిస్థితుల్లో రూ.1,300 నుంచి రూ.1,450కే అమ్ముకున్నారు. ప్రభుత్వ నిర్వాకంతో బస్తాకు రూ.400 నుంచి రూ.500 వరకూ నష్టపోయారు. ఇప్పుడు మిగిలిన పంట ఒబ్బిడి చేసుకుందామనేసరికి అకాల వర్షాలు దెబ్బ తీశాయి. జిల్లాలో ఇప్పటి వరకూ 3.4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఆ లెక్కన ఇంకా 2.23 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాల్సి ఉంది. ప్రభుత్వం ముందుగానే ధాన్యాన్ని కొనుగోలు చేసి ఉంటే అకాల వర్షాల ముప్పు నుంచి బయటపడే వారమని రైతులు విలపిస్తున్నారు. ఈ వర్షాలకు పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం, కరప, కాకినాడ రూరల్, తాళ్లరేవు, పెదపూడి, జగ్గంపేట, గండేపల్లి తదితర మండలాల్లో ధాన్యం తడిసిపోయింది. దాదాపు ప్రతి మండలంలోనూ ఆరేడు వందల మెట్రిక్ టన్నుల ధాన్యం కళ్లాలు, రోడ్లపై ఉంది.



ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడిలో మొలకలు వచ్చిన ధాన్యం

తడిసిన ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నామని మంత్రి నాదెండ్ల చెబుతుండగా.. క్షేత్ర స్థాయిలో మాత్రం తేమ 18 శాతం దాటిన ధాన్యాన్ని కూడా మిల్లర్లు కొనుగోలు చేయని పరిస్థితి నెలకొంది. అకాల వర్షాలతో తడిసిన ధాన్యంలో తేమ 20 శాతం పైనే ఉంది. కొన్నిచోట్ల 23 శాతం కూడా కనిపిస్తోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లపై కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం రాత్రి జరిపిన సమీక్షలో తేమ 22 శాతం ఉన్నా కొనుగోలు చేయాలని మిల్లర్లకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఇవి ఎంతవరకూ అమలవుతాయో వేచి చూడాలి.

ప్రభుత్వం సకాలంలో కొనకే..



రబీలో ఆరెకరాలు సాగు చేశాను. ఎకరాకు రూ.40 వేల వరకూ పెట్టుబడి అయింది. పంట కోత కోసి, ధాన్యం రాశి చేసి ఉంచాను. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనలేదు. మిల్లర్లకు అమ్ముదామంటే 75 కిలోల బస్తా రూ.1,550కి తీసుకుంటామన్నారు. గత్యంతరం లేక రాశి పైనే ధాన్యం ఉంచి వేచి చూస్తే వర్షానికి తడిసి ముద్దయ్యింది. ఇప్పుడు మిల్లర్లకు అమ్ముదామంటే 75 కిలోల బస్తా రూ.1,450కి అడుగుతున్నారు. బస్తాకు రూ.275 నష్టపోవాల్సి వస్తోంది. ప్రభుత్వ మద్దతు ధర రూ.1,725కు కొనుగోలు చేయాలి. ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో రూ.77,550 నష్టం వస్తోంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి ధాన్యాన్ని మద్దతు ధరకు కొనేలా చర్యలు తీసుకోవాలి. లేకపోతే అప్పుల పాలవుతాం.

– వెలుగుబంట్ల రవినాయుడు, రైతు, కూరాడ, కరప మండలం

అదనపు ఖర్చులు తప్ప లాభం లేదు



దాళ్వాలో నాలుగెకరాలు సొంతంగా, 11 ఎకరాలు కౌలుకు తీసుకుని బీపీటీ (సన్నాలు) రకం వరి సాగు చేశాను. ఎకరాకు రూ.33 వేల పెట్టుబడి పెడితే 32 బస్తాల దిగుబడి వచ్చింది. కోత కోసిన వెంటనే గిట్టుబాటు ధర కంటే తక్కువకు రూ.1,350 వంతున మిల్లుకు పంపితే, తేమ శాతం ఎక్కువంటూ తీసుకోలేదు. తిరిగి ధాన్యం వెనక్కి తీసుకువచ్చి ఆరబెట్టిన తర్వాత మిల్లుకు పంపితే గిట్టుబాటు ధర రూ.1,750కి తీసుకున్నారు. ట్రాక్టర్ కిరాయి రూ.5 వేలు, బస్తాకు రూ.65 వంతున ఎకరాకు రూ.2,080 వెరసి రూ.7,080 అదనపు ఖర్చయ్యింది. మిల్లర్లు వెంటనే ధాన్యం తీసుకుంటే సరేసరి. లేకుంటే ట్రాక్టరుకు రోజుకు రూ.5 వేల వంతున అదనంగా కిరాయి చెల్లించాలి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో న్యాయం జరగడం లేదు. గత ప్రభుత్వంలో ఈ దుస్థితి లేదు. పండిన పంటకు గిట్టుబాటు ధర, రైతు భరోసా అందేవి.

– సీంద్రపు భాస్కరరావు, రైతు, ప్రత్తిపాడు

నష్టపరిహారం ఇవ్వాలి



నేను మూడెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాను. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకూ పెట్టుబడి అయింది. వరి చేను కోసి, ధాన్యం రాశులుగా పోశాను. అమ్ముకుందామంటే బస్తా రూ.1,300కు మాత్రమే అడుగుతున్నారు ఇంతలో అకాల వర్షంతో ధాన్యమంతా తడిసిపోయింది. దీనిని కొనే నాథుడు లేక ఏం చేయాలో పాలుపోని పరిస్థితి. నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకోవాలి. నష్టపరిహారం ఇప్పించాలి. – దడాల గురయ్య, పాత కోదాడ, తొండంగి మండలం

ప్రభుత్వ తీరుతోనే ఈ దుస్థితి



నేను 17 ఎకరాల్లో వరి సాగు చేశాను. 14 ఎకరాలు కోత కోసి ధాన్యం ఆరబెట్టాను. వర్షం కారణంగా ఇది మొత్తం తడిసి ముద్దయ్యింది. మరో నాలుగెకరాల్లో వరి పంట నేల నంటింది. ఎకరాకు రూ.30 వేలు పైగా పెట్టుబడి పెట్టాను. తడిసిన ధాన్యం అమ్మితే చాలా నష్టం వస్తుంది. ధాన్యాన్ని ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయకపోవడం, మిల్లర్లు ధాన్యాన్ని సక్రమంగా కొనుగోలు చేయనందు వల్లనే మాకు ఈ దుస్థితి ఏర్పడింది.

– శాంతా సత్తిబాబు, కాట్రావులపల్లి, జగ్గంపేట

ధాన్యం తడిసి ముద్దయ్యింది



దాళ్వాలో రెండెకరాలు సొంతంగా, మూడెకరాలు కౌలుకు వరి సాగు చేశాను ఎకరాకు రూ.35 వేల వరకూ పెట్టుబడి పెట్టాను. ఎకరాకు 50 బస్తాల దిగుబడి వచ్చింది. ఆదివారం కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసి ముద్దయ్యింది. పొలంలోకి వర్షపు నీరు చేరడంతో సురక్షిత ప్రదేశాలకు ధాన్యం చేర్చడానికి ఎకరాకు రూ.4 వేల నుంచి రూ.5 వేలు అవుతుంది. ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించినా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనడం లేదు. అయినకాడికి దళారులకు అమ్ముకోవలసిన దుస్థితి ఏర్పడింది. ఇప్పుడు ధాన్యం తడిసిపోవడంతో ధర మరింత తగ్గే పరిస్థితి ఏర్పడింది.

– వెలమర్తి బుల్లిరాజు, రైతు, వీకే రాయపురం, సామర్లకోట మండలం

ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు లేక, పంటకు గిట్టుబాటు ధర లేక వరి రైతులు చాలా ఇబ్బందులకు గురయ్యారు. మద్దతు ధర, ధాన్యం సేకరణ విషయంలో కాలయాపన వలన అకాల వర్షం కూడా రైతులకు మరింత నష్టం కలిగించింది. అకాల వర్షాలకు పిఠాపురం నియోజకవర్గంలో రైతులు, కౌలు రైతులకు చెందిన సుమారు 530 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిపోయి, నష్టం వాటిల్లింది. ఇంకా మామిడి, అరటి, ఇతర రైతులు కూడా కష్టాల్లో ఉన్నారు. ప్రభుత్వం వెంటనే తడిసిన ధాన్యం కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలి.

– వంగా గీత, మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, పిఠాపురం

నియోజకవర్గాల వారీగా..

- **జగ్గంపేట నియోజకవర్గంలో రైతులు 21,209 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విక్రయించగా, మరో 5,440 మెట్రిక్ టన్నులు రోడ్ల పైన, కళ్లాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది.**
- కాకినాడ రూరల్ నియోజకవర్గంలో అకాల వర్షాలకు 830 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిపోయింది. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఈ నియోజకవర్గంలో బహిరంగ మార్కెట్‌లో 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వచ్చింది.
- పెద్దాపురం నియోజకవర్గంలో 40 వేల ఎకరాల్లో వరి సాగు జరిగింది. లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. కనీస మద్దతు ధర దక్కకపోగా 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు కమీషన్ ఏజెంట్లకే అమ్ముకోవాల్సి వచ్చింది. మరో 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కళ్లాల్లోనే తడిసిపోయింది.
- ప్రత్తిపాడు నియోజకవర్గంలో 29,960 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది. దీనిలో 10,800 మెట్రిక్ టన్నులు కొనుగోలు కేంద్రాల్లో అమ్మగా బయట వ్యక్తులు 18 వేల టన్నులు కొనుగోలు చేశారు. మిగిలిన ధాన్యం వర్షానికి తడిసిముద్దయ్యింది.
- పిఠాపురం నియోజకవర్గంలో 1,147 మెట్రిక్ టన్నుల ధాన్యం వర్షంలో తడిసిపోయిందని అధికారులు చెబుతున్నారు. అయితే, రైతులు చెబుతున్న అంచనాలను బట్టి తడిసిన ధాన్యం 2,500 మెట్రిక్ టన్నుల వరకూ ఉంది.
- తుని నియోజకవర్గంలో 4,600 మెట్రిక్ టన్నుల ధాన్యం రోడ్ల పైన, కళ్లాల్లో ఉంది.

వైఎస్సార్ సీపీ హయాంలో..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తడిసి ముద్దయిన ధాన్యాన్ని సైతం అధికారులే దగ్గరుండి మరీ కొనుగోలు చేయించారు. వరి కోతలు మొదలవుతాయనగానే అప్పట్లో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ముందుగానే ప్రారంభించింది. తడిసిన ధాన్యంలో తేమ శాతం 18, 20.. ఇలా ఎంత ఉన్నా కళ్లాల్లోనే కొనుగోలు చేసింది. నేరుగా పౌర సరఫరాలు, రెవెన్యూ అధికారులు బృందాలుగా కళ్లాల్లోకి వెళ్లి, తూకాలు వేయించి ట్రాక్టర్ల పైకి ఎక్కించి మిల్లులకు తోలిన రోజులను రైతులు గుర్తుకు తెచ్చుకుంటున్నారు. ఇప్పుడు పరిస్థితి పూర్తి భిన్నంగా ఉందని మండిపడుతున్నారు.

స్వామి సంబరానికి వాహనాల ముస్తాబు

- రేపటి నుంచి సత్యదేవుని కల్యాణోత్సవాలు
- ఊపందుకున్న ఏర్పాట్లు
- ఉత్సవ వాహనాలకు తుది మెరుగులు



సత్యదేవుని వార్షిక కల్యాణ మండపంలో ప్రారంభమైన అలంకరణ



అన్నవరం: సత్యదేవుని దివ్యకల్యాణ శుభ ఘడియలు సమీపిస్తున్నాయి. కాస్త ఆలస్యంగా మొదలైన ఏర్పాట్లు నెమ్మదిగా ఊపందుకున్నాయి. కల్యాణోత్సవాలు బుధవారం ప్రారంభం కానున్న వేళ రత్నగిరి సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ముఖ్యంగా రత్నగిరి రామాలయం పక్కన ఉన్న సత్యదేవుని వార్షిక కల్యాణ వేదిక అలవకరణ పనులు మొదలయ్యాయి. కల్యాణోత్సవాలను పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లను ఊరేగించే ఉత్సవ వాహనాలను దాదాపు సిద్ధం చేశారు. వెండి గజ, గరుడ, ఆంజనేయ వాహనాలకు మెరుగులు పెట్టిస్తున్నారు. దీంతో ఆ వాహనాలు నూతన శోభతో తళతళా మెరుస్తున్నాయి. కాకినాడకు చెందిన పీవీఎల్ మూర్తి తన బృందంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఏటా తాను ఉత్సవ వాహనాలతో పాటు, వెండి సింహాసనాలు, వెండి మకర తోరణం వంటి వాటికి మెరుగు పెట్టిస్తానని ఆయన తెలిపారు. అలాగే, కొండ దిగువన ఉన్న రావణ బ్రహ్మ, పొన్నచెట్టు చెక్క వాహనాలకు కూడా దేవస్థానం అధికారులు రంగులు వేయించి ముస్తాబు చేయించారు. దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్‌కు గత శనివారం సత్యదేవుని కల్యాణోత్సవ శుభలేఖ అందజేశారు. ఈ సందర్భంగా ఈ నెల 11న జరిగే రథోత్సవం పకడ్బందీగా నిర్వహించడంపై దృష్టి పెట్టాలని ఈఓ వీర్ల సుబ్బారావుకు కమిషనర్ సూచించారు. రథోత్సవం సందర్భంగా గత ఏడాది తాను అప్పటి ఈఓగా తీసుకున్న జాగ్రత్తలను వివరించారు. కాగా, రథోత్సవం నాడు పూర్తి స్థాయిలో జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ షణ్మోహన్ కూడా ఇప్పటికే ఈఓను ఆదేశించారు.



మెరుగు పెట్టడంతో మెరిసిపోతున్న వివిధ వెండి వాహనాలు



కొత్త రంగులద్దుకున్న పొన్నచెట్టు, రావణబ్రహ్మ వాహనాలు

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం



ఖైదీలనుద్దేశించి మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహకరిస్తుందని ఆ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీలక్ష్మి అన్నారు. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారాన్ని సోమవారం ఆమె సందర్శించారు. జైలులో ఆహార ప్రమాణాలు, ఇతర సదుపాయాలను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడారు. వారి తరఫున ఉచితంగా వాదించేందుకు న్యాయవాదులు కావాలన్నా, బెయిల్ పిటిషన్లు, పై కోర్టుల్లో అప్పీలు వేయాలన్నా, మరే ఇతర న్యాయ సహాయం కావాలన్నా తమ సంస్థ సహకారం అందిస్తుందని తెలిపారు. ఎవరైనా ఖైదీలు న్యాయ సహాయం కావాలని అనుకుంటే సంస్థ నియమించిన పారాలీగల్ వలంటీర్ల ద్వారా అర్జీలు అందించాలని సూచించారు. ముద్దాయిలు, ఖైదీల కోసం పని చేస్తున్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను వినియోగించుకోవాలని శ్రీలక్ష్మి అన్నారు.

క్లుప్తంగా

గోకులంలో బెల్ట్‌షాపు!



పిఠాపురం మండలం రాపర్తిలో గోకులం షెడ్డులో ఏర్పాటు చేసిన మద్యం షాపు

పిఠాపురం: కిళ్లీ కొట్టు, కిరాణా కొట్టు అది ఇదీ అని కాదు ఎక్కడ చూసినా బ్రాందీ బెల్టు షాపులే. కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం ఏరులై పారుతున్నదనడానికి ప్రతీ గ్రామంలోను ఇవి ప్రత్యక్ష సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. చివరకు గోవులను సంరక్షించడానికి ప్రభుత్వ నిధులతో నిర్మించిన గోకులంను సైతం వదలలేదు కూటమి నేతలు. పిఠాపురం మండలం రాపర్తిలో గోవుల కోసం నిర్మించిన గోకులంలో బ్రాందీ షాపు ఏర్పాటు చేయడం చూసిన స్థానికులు మరీ ఇంత దారుణమా? మూగజీవాలు ఉండాల్సిన చోట మద్యం షాపు ఏమిటంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. బ్రాందీషాపు అంటూ బోర్డు పెట్టి మరీ విచ్చలవిడిగా మద్యం అమ్ముతున్నప్పటికీ అది లైసెన్సు ఉన్న బ్రాందీ షాపు కాకుండా బెల్టుషాపు కావడం కొసమెరుపు.

మద్యం తాగి బైక్ నడిపిన వారికి జైలు

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో 8 మందికి రెండు రోజుల చొప్పున జైలు, 9 మందికి రూ. 10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. సోమవారం కోర్టులో 17 మందిని హాజరుపర్చగా వారికి పై విధంగా జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మామిడిపై ఈగ దాడి

- నాణ్యతను దెబ్బతీస్తున్న వైనం
- జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచన

పిఠాపురం: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన మామిడి పండ్ల సీజన్ వచ్చేసింది. ఈ ఏడాది ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో మామిడి పూత కాస్త అలస్యం అయ్యింది. దీని ప్రభావం మామిడి దిగుబడిపై చూపుతుండగా దిగుబడులతో పాటు కాయ నాణ్యతను దెబ్బతీసే వాటిలో పిండిపురుగులు, కాయతొల్చు పురుగులు, పండుఈగలు ఉన్నాయి. వీటిలో పండుఈగ పంటకు అపార నష్టాలను కలుగజేస్తుంది. పండుఈగ సుమారు 60 శాతం పంటను నాశనం చేస్తుంది. ఎండాకాలం ఎప్పుడు వస్తుందా ఎప్పుడెప్పుడు మధురమైన మామిడి కాయల రుచి ఆస్వాదిద్దామా అని అందరూ ఎదురు చూస్తుంటారు. రకం ఏదైనా మామిడి రుచి ప్రత్యేకమైనదే. అటువంటి మామిడి కాయలకు కొన్నేళ్లుగా పండు ఈగ రూపంలో పెద్ద కష్టం వచ్చిపడింది. కాయ చూడడానికి పైకి బాగానే కనిపిస్తుంది. తీరా మాగ వేసి పండిస్తే కుళ్లు కనిపిస్తుంది. దాని లోపల చూస్తే బియ్యపు గింజ పరిమాణంలో తెల్లటి పురుగులు కనిపిస్తుంటాయి. ఒకప్పుడు కాపు దశలో వర్షాలు పడ్డ సందర్భాలలోనే ఇవి కనిపించేవి. కానీ కొన్నేళ్లుగా పండుఈగ నష్టం రివాజుగా మారింది. అన్ని ప్రాంతాల్లోనూ ఈ పండు ఈగ కనిపిస్తున్నప్పటికి కాకినాడ జిల్లాలో 18,409.23 హెక్టార్లలో మామిడి పంట సాగవుతుండగా ప్రస్తుతం ఈ పండు ఈగ దాడి పెరగనున్నట్లు ఉద్యానవన శాఖ అధికారులు రైతులను హెచ్చరిస్తున్నారు. ఇది వ్యాపిస్తే నష్టం అపారంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. పండుఈగ తన సంతతిని పెంచుకుని తోటల్లో మాటు వేసి ఉన్నట్లు గుర్తించారు. పండుఈగ సోకితే మామిడి నాణ్యత పూర్తిగా దెబ్బతిని రాబడి పడిపోయి రైతు తీవ్రంగా నష్టపోయే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం మామిడి సీజన్ కావడంతో మే, జూన్ నెలల్లో ఎక్కువగా సోకి మామిడి పండ్లకు నష్టం కలిగించే పండు ఈగ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పిఠాపురం ఉద్యానవన శాఖాధికారిణి కేఎస్ శైలజ సూచిస్తున్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్ అమ్మకాలు ఉన్నందున నాణ్యత దెబ్బతినకుండా ఉండాలంటే పండు ఈగ పట్ల జాగ్రత్తలు పాటించాలని ఆమె సూచిస్తున్నారు.



మామిడి తోటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్న అధికారులు



పండు ఈగ నుంచి రక్షణగా ఏర్పాటు చేసే లింగాకర్షక బుట్టలు



పండు ఈగలు

ఎగుమతులపైనా ప్రభావం

ఈగల దాడి వల్ల మామిడి పండు నాణ్యత తగ్గిపోతుండడంతో ఎగుమతులపైనా తీవ్ర ప్రభావం పడుతోందని రైతులు అంటున్నారు. మామిడి సీజన్‌లో జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు ఇతర దేశాలకు మామిడి పండ్లు ఎగుమతి అవుతుంటాయి.

కానీ ప్రస్తుతం పండుఈగ సోకడం వల్ల పండు లోపల పురుగులు కనిపిస్తుండడంతో వ్యాపారులు కొనుగోళ్లను నిలిపివేస్తున్నారని రైతులు చెబుతున్నారు. తద్వారా ఎగుమతి లేక ధర పతనం అయ్యి పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఎదురయ్యిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాలిన పండ్ల వల్లే పండు ఈగ దాడి పెరుగుతుంది

మామిడి తోటల్లో నేల మీద పడిన పండ్లను అలాగే వదిలేస్తే పండు ఈగ విపరీతంగా పెరుగుతుంది. దీనికి తోడు ప్రస్తుతం వర్షాలు ఈదురు గాలులతో మామిడి కాయలు భారీగా నేల రాలుతున్నాయి. అలా నేల మీద వదిలేసి పండ్లను పండుఈగలు తమ సంతతిని వృద్ధి చేసుకోడానికి వేదికగా వాడుకుంటాయి. తద్వారా విపరీతంగా పండు ఈగలు పెరిగి చెట్లకు ఉన్న కాయలపైనా గుడ్లు పొదుగుతాయి దీంతో కాయ బయటకు బాగా కనిపించినా లోపల పండు తయారయ్యాకా పురుగులు కనినిపిస్తుంటాయి. పండు ఈగ జామ తోటల్లో ఎక్కువగా ఉంటుంది. అందుకని పక్కన జామ తోటలు ఉన్న ప్రాంతాల్లో మామిడి తోటలు ఉన్న రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. జామ తోటల సీజన్ ముగియగానే ఆ ఈగలు మామిడి తోటలపై దాడి చేస్తుంటాయి.

ముందు జాగ్రత్తలే మేలు



ముందు జాగ్రత్త చర్యలతోనే ఈగను గుర్తించి నివారించుకోవాలి. వచ్చిన తరువాత నివారించడం ఇబ్బందిగా మారుతుంది. ఎప్పటికప్పుడు మామిడి తోటల్లో రాలిన కాయలు, పండ్లను వెంటనే తీసి వాటిని దూరంగా ఒక గొయ్యి తీసి పాతి పెట్టుకోవాలి. లింగాకర్షక బుట్టలు (పెరిమోన్ ట్రాప్స్) తోటల్లో ఏర్పాటు చేసుకోవాలి. సుమారుగా ఎకరానికి 5 నుంచి 6 బుట్టలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా పండుఈగ ఉధృతిని తగ్గించి, నివారణ చర్యలు తీసుకోవడానికి వీలు కలుగుతుంది. లింగాకర్ష బుట్టలలో 4 ఈగలు పడితే కచ్చితంగా ఈగ ఉధృతి ఉన్నట్లు గుర్తించాలి. దీని నివారణకు పులిసిన కల్లు కానీ, మలాథియాన్ కానీ రెండు మిల్లీలీటర్లు కలిపి కొద్దిగా బెల్లం వేసి ఉంచాలి. అది పులిసి ఒక రకమైన వాసన వస్తుంది. దానిలో ఏదైనా పండ్ల రసం కలిపి ఆ మిశ్రమాన్ని మట్టి పాత్రలలో తోటల్లో అక్కడక్కడా పెట్టాలి. దానికి పండుఈగ అధికంగా ఆకర్షితమై వచ్చి ఆ రసం పీల్చగానే చనిపోతుంది. ఈ విధానం వల్ల రసాయనాలు ఉపయోగించకుండా సేంద్రియ పద్ధతిలో ఈగను నివారించవచ్చు. ఇంకా ఈగ ఉధృతి ఎక్కువగా ఉంటే ఒక లీటరు నీటికి రెండు మిల్లీలీటర్లు మలాథియాన్ కలిపి తోటల్లో పిచికారీ చేసుకోవాలి. కాయలకు కవర్లు ఏర్పాటు చేయడం ద్వారా ఈగ ఉధృతిని తగ్గించుకోవచ్చు గాని కవర్లు కొన్ని రోజులు ఉంచి తీసేయకూడదు. అలా తీయడం వల్ల ఈగ దాడి చేసే అవకాశం ఉంది. కాయను పూర్తిగా కోయవలసి వచ్చినప్పుడు మాత్రమే కవర్లు తీయాలి. కవరు తీసిన కాయలను చెట్టుకు ఉంచ కూడదు.

కె.సత్య శైలజ, ఉద్యాన శాఖాధికారిణి, పిఠాపురం

రూ.10 కోట్ల విలువైన భూమిని కాపాడండి

- ఒకటో డివిజన్‌లో ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి
- కలెక్టర్‌కు మాజీ ఎంపీ భరత్ ఫిర్యాదు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కార్పొరేషన్ పరిధిలో లాలాచెరువు వద్దగల సాయిదుర్గానగర్‌లో దాదాపు రూ.10కోట్ల విలువైన 1,300 గజాల స్థలాన్ని కొందరు వ్యక్తులు మాఫియాగా ఏర్పడి కాజేస్తున్నందున ప్రభుత్వం దృష్టి సారించి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కి ఆయన ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 186-1, ఏరియాలో ప్లాట్లుగా విభజించిన సమీప డోర్ నంబర్ 72-16-1/2 వద్ద ప్లాటు నంబర్ 30లో 524 చదరపు గజాల ప్లాటు, నంబర్ 9లో 406 చదరపు గజాల ప్లాటు, నంబర్ 10లో 387 చదరపు గజాలు మొత్తం 1317 చదరపు గజాల స్థలాన్ని ఆక్రమించారని భరత్ విజ్ఞాపన పత్రంలో పేర్కొన్నారు. ఇది కార్పొరేషన్‌కి వదిలిన పార్కుకు సంబంధించిన స్థలం అని అయితే కొందరు వ్యక్తులు దీనికి సంబంధించిన దస్తావేజు నకళ్లను తీసి దానికి వారసులుగా విజయనగరం జిల్లా, గంట్యాడ మండలం, రామవరంలో ఓ మహిళకి గిఫ్ట్ వచ్చినట్లు నకిలీ డాక్యుమెంట్ పుట్టించి విజయనగరం జిల్లాలో రిజిస్టర్ చేయించారని ఆయన వివరించారు. కానీ ఈ నంబర్లు రాజమహేంద్రవరం రిజిస్టర్ ఆఫీసులో నమోదు కాలేదని, మున్సిపల్ కార్పొరేషన్లో ఖాళీ స్థలం పన్ను కూడా వేయించారని భరత్ పేర్కొన్నారు. పదికోట్ల రూపాయల విలువైన భూమిని కాజెయ్యడానికి మాఫియా చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని ఆయన కోరారు. పక్కాగా ఉన్న ఆధారాలన్నీ పూర్తిగా పరిశీలించి, ఈ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి, మున్సిపల్ కార్పొరేషన్‌కి సంబంధించిన పార్కు సలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఆయన కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఖాళీస్థలాలు, ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే చాలు భూ మాఫియా పేట్రేగిపోతోందని విమర్శించారు.



కలెక్టర్ ప్రశాంతికి వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎంపీ భరత్‌రామ్

సార్వత్రిక సమ్మెలో మేము సైతం



సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ నేతలు

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం రూరల్: దేశవ్యాప్తంగా ఈ నెల 20వ తేదీన చేయబోయే సార్వత్రిక సమ్మెలో ఎల్ఐసీ క్లాస్-3, క్లాస్-4 ఉద్యోగులు 50వేలమంది భాగస్వామ్యం అవుతున్నారని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ రాజమహేంద్రవరం డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ తెలిపారు. సోమవారం మోరంపూడి ఎల్ఐసీ రాజమహేంద్రవరం డివిజనల్ కార్యాలయంలో భోజన విరామ సమయంలో సార్వత్రిక సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన, యూనియన్ అధ్యక్షుడు ఎస్ఆర్‌జే మాథ్యూస్, నాయకులు ఆవిష్కరించారు. కోదండరామ్, మాథ్యూస్ మాట్లాడుతూ నేషనల్ కన్వెన్షన్ ఆఫ్ వర్కర్స్ ఇచ్చిన పిలుపు మేరకు ఎల్ఐసీలో అతి పెద్ద సంఘం అయిన ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఈ సమ్మెలో పాల్గొంటుందన్నారు. ఈ సమ్మెలో ఇన్సూరెన్స్ రంగానికి సంబంధించిన ముఖ్యమైన సమస్యలను కూడా పరిష్కరించాలని కోరుతూ పాల్గొంటున్నామన్నారు. బీమా పాలసీలపై జీఎస్టీ రద్దు చేయాలని, ఎల్ఐసీలో ఖాళీగా ఉన్న క్లాస్ 3, 4 ఉద్యోగాల భర్తీ వెంటనే చేపట్టాలని, నూతన పెన్షన్ పథకం రద్దు చేసి, ఎల్ఐసీలో ఉన్న ఉద్యోగులు అందరికీ 1995 పెన్షన్ పథకం అమలు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సాధారణ బీమా కంపెనీలను ఒకే కంపెనీగా చేయాలని, కనీస వేతనం రూ.26,000 అందరికీ ఇవ్వాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. మహిళా కన్వీనర్ శిరీష, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి సమ్మతం గనెయ్య, ఓబీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్, అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,000
గటగట (వెయ్యి)	18,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260



రైతులకు అండగా ఉండండి

అధికారులతో మంత్రి మనోహర్

కాకినాడ సిటీ: అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు అండగా నిలవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మిల్లర్లు, అధికారులను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో మంత్రి కాకినాడ, బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల ప్రజాప్రతినిధులు, జాయింట్ కలెక్టర్లు, రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ఆదివారం కురిసిన వర్షాల వల్ల ధాన్యం తడిసి రైతులు ఆందోళన చెందుతున్న విషయాన్ని వివరించారు. కాకినాడ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రగతిని జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా వివరించినప్పుడు ట్రాన్స్‌పోర్టు కోసం ఉపయోగించే ట్రైలర్ల సర్టిఫికేషన్‌కు తీవ్ర జాప్యం జరుగుతోందని ఎమ్మెల్యేలు తెలిపారు. రవాణాశాఖ అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని కలెక్టర్ షణ్మోహన్ వివరించారు. బొండాలు రకం బాయిల్డ్‌రైస్ సేకరణకు ఎఫ్‌సీఐ అనుమతి కోరామన్నారు. అనుమతి వచ్చే లోపు కొనుగోళ్లు కొనసాగించాలని పౌరసరఫరా సంస్థ ఎండీ మనజీర్ జిలానిసామూల్ మిల్లర్లను కోరారు. ఎఫ్‌సీఐలో మాన్యువల్ గ్రెయిన్ ఎనాలసిస్ వల్ల రిజెక్షన్ ఎక్కువగా ఉంటున్నందున ఆటోమేటిక్ అనాలసిస్ అమలు చేసేలా చూడాలని కోరారు. కోనసీమ జిల్లా సమీక్షలో వివిధ మండలాల్లో పంట కోతల సమయాల్లో తేడాలు ఉన్నందున రైతు సేవా కేంద్రాల టార్గెట్‌లను అడ్జస్ట్ చేయాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరగా గతంలో ఉమ్మడి జిల్లాలో కొనుగోలు నిర్వహించిన డ్వాక్రా సంఘాలకు పెండింగ్ ఉన్న సుమారు. రూ.16.75 లక్షల కమీషన్ చెల్లింపునకు సంబంధించి మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. గోకవరం మండలంలో రైస్ మిల్లులు లేవని, కొనుగోళ్లకు ప్రత్యేక ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కోరారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రైతులు నష్టపోకుండా తడిసిన ధాన్యం అంతా కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం నెమ్ము 22 శాతం వరకూ ఉన్నా కొనుగోళ్లు జరపాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అన్ని జిల్లాల్లో ఇకపై బ్యాంకు గ్యారంటీని ప్రామాణికంగా 1:2 నిష్పత్తిగా అమలు చేస్తామని మంత్రి నాదెండ్ల తెలియజేశారు. మూడు జిల్లాల్లో సీఎంఆర్ టార్గెట్‌ను పెంచామని చెప్పారు. కాకినాడ జిల్లాకు 50 వేల టన్నులు బొండాల రకం, బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు లక్ష టన్నులు, తూర్పుగోదావరి జిల్లాకు ఇప్పటికే పెంచిన 30 వేలకు అదనంగా మరో 50వేల టన్నులు టార్గెట్‌ను పెంచుతున్నామని మంత్రి వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

సత్యదేవుని కల్యాణానికి ఏర్పాట్లు

- టేకు రథం ట్రయల్ రన్ విజయవంతం
- 13 వరకు పలు వైదిక కార్యక్రమాల నిలుపుదల

అన్నవరం: వైశాఖ శుద్ధ దశమి బుధవారం నుంచి వైశాఖ బహుళ పాడ్యమి వరకు జరుగనున్న సత్యదేవుని దివ్య కల్యాణ మహోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు అన్నవరం దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు తెలిపారు. సోమవారం ఆయన రత్నగిరిపై ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ మే ఎనిమిదో తేదీ, వైశాఖ శుద్ధ ఏకాదశి గురువారం రాత్రి తొమ్మిది గంటల నుంచి సత్యదేవుని దివ్య కల్యాణం జరుగుతుందని తెలిపారు.

టేకు రథం ట్రయల్ రన్ విజయవంతం

సత్యదేవుని కల్యాణ మహోత్సవాలలో ఐదో రోజు మే 11న నిర్వహించనున్న సత్యదేవుని రథోత్సవంలో ఉపయోగించే టేకు రథం ట్రయల్ రన్ సోమవారం నిర్వహించారు. రథానికి ముందు ట్రాక్టర్ కట్టి కొద్ది దూరం నడిపించారు. పెద్దాపురం ఆర్డీఓ రమణి సోమవారం రత్నగిరికి విచ్చేసి స్వామివారి కల్యాణ ఏర్పాట్ల గురించి ఈఓతో మాట్లాడారు. కల్యాణ మహోత్సవాల సందర్భంగా మే ఏడు నుంచి 13వ తేదీ వరకు స్వామివారి నిత్యకల్యాణం, ఆయుష్య హోమం, సహస్ర దీపాలంకారసేవ, పంచ హారతుల సేవ, ప్రతీ శుక్రవారం వనదుర్గ అమ్మవారికి జరిగే చండీహోమం, పౌర్ణిమ నాడు జరిగే ప్రత్యంగిర హోమం, రాత్రి వేళల్లో జరిగే పవళింపు సేవ నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు. స్వామివారి వ్రతాలు, ఇతర కార్యక్రమాలు యథావిధిగా జరుగుతాయి.



టేకు రథం ట్రయల్ రన్ నిర్వహిస్తున్న సిబ్బంది

మీ నిర్లక్ష్యంతో 400 మందికి నష్టం

- కోర్టు సాకుతో తప్పించుకోవద్దు
- స్పందనలో సచివాలయ ఏఎన్ఎంల ఆవేదన

కాకినాడ క్రైం: అర్హులైన తమకు ఎంపీహెచ్ఏఎఫ్ (మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఫీమేల్)గా పదోన్నతి కల్పించడంలో ఉద్దేశ పూర్వక జాప్యం తగదని సచివాలయ ఏఎన్ఎంలు ఆవేదన వ్యక్తం చేశారు. నలుగురి కోసం నాలుగొందల మంది భవితకు చేటు చేయవద్దని అధికారులను వేడుకున్నారు. ఈ మేరకు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఏఎన్ఎంలు సోమవారం కాకినాడ కలెక్టరేట్‌కు వచ్చి స్పందన కార్యక్రమంలో తమ ఆవేదనను వెళ్లగక్కారు. డీఆర్వో వెంకట్రావుకు వినతి సమర్పించారు. గతేడాది అక్టోబర్‌లో ప్రభుత్వం సచివాలయ ఏఎన్ఎంలకు పదోన్నతి కల్పించే ప్రక్రియను ప్రారంభించినట్లు ప్రకటించిందన్నారు. ఈ ప్రకటనకు అనుగుణంగా అన్ని జిల్లాల్లోనూ ఈ ప్రక్రియ పూర్తి కావస్తుండగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మాత్రం కనీసం ప్రారంభం కాలేదని వెల్లడించారు. పదోన్నతుల కోసం ధ్రువపత్రాల పరిశీలన గత నెల 26 నుంచి 29 తేదీల మధ్య జరిగిందని, తదనంతరం సీనియారిటీ జాబితా నేటికీ ప్రచురించి ప్రదర్శించలేదని డీఆర్వో దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై డీఆర్వో డీఎంహెచ్‌వోను ప్రశ్నించగా, మార్కుల వెయిటేజ్, ఎస్‌సీ చట్టంలో క్లాసిఫికేషన్ అంశాల ప్రాతిపదికన కోర్టులో కేసు వేయడం వల్ల సీనియారిటీ జాబితాను ప్రదర్శించకుండా నిలిపామని సమాధానం ఇచ్చారు. ఆయన సమాధానంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఏఎన్ఎంలు ఇతర జిల్లాల్లో జీవోల ఆధారంగా ప్రమోషన్ల ప్రక్రియ పూర్తి చేస్తుంటే మీకు మాత్రమే వచ్చిన అడ్డంకి ఏంటని ప్రశ్నించారు. కోర్టు సాకుతో పదోన్నతుల ప్రక్రియ చేపట్టకుండా తప్పించుకోవడం సబబు కాదని, మీ నిర్లక్ష్యం 400 మంది భవితకి నష్టమని తమ ఆవేదనను వెళ్లగక్కారు.



తమ సమస్యను నివేదించేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన ఉమ్మడి జిల్లా సచివాలయ ఏఎన్ఎంలు

ఘనంగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న అర్చకులు, భక్తులు

మురమళ్లలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

మురమళ్ల: నిత్యకళ్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి వారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. మే 1 నుంచి 5 వతేదీ వరకు ఈ ఉత్సవాలు ఆలయ అర్చకులు శైవాగమ పండితులు బ్రహ్మశ్రీ యనమండ్ర సత్యసీతారామ శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిగాయి. సోమవారం గవ్యాంతము, కళాన్యాసం, వసంతోత్సవం పవిత్ర వృద్ధ గౌతమీ నది వద్ద త్రిశూల స్నానం, సాయంత్రం స్వామిఅమ్మవార్లను రథంపై ఊరేగిస్తూ గ్రామోత్సవం జరిపారు. అనంతరం పుష్పోత్సవం, పవళింపుసేవ తదితర కార్యకర్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా ముగిశాయి.

ప్రత్యేక ఆకర్షణ

బ్రహ్మోత్సవాలో భాగంగా ఆఖరు రోజు రథోత్సవం వైభవంగా జరిగింది. శ్రీ భద్రకాళీ వీరేశ్వర స్వామి వారిని టేకు రథంపై పచ్చి పూలతో అలంకరించారు. శ్రీకాళహస్తి దేవస్థానం ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ రాజేష్ గురుకుల్ శిష్య బృందం ఐదు రోజులు చేసిన విశేష అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సుమారు 70 మంది పండితుల వేద మంత్రోచ్ఛారణల మధ్య మేళ తాళాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం వేద పండితులను, విశేష అలంకరణ చేసిన పండితులను ఘనంగా సత్కరించారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.